క్లుప్తంగా

'రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్య బాధాకరం'

ఐనవోలు : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) జిల్లా అధ్యక్షుడు, ఎంఆర్ఐ మరుపట్ల మల్లయ్య శుక్రవారం ఓ ప్రకటనలో విచారణ వ్యక్తం చేశారు. తహసీల్దార్లు కిందిస్థాయి ఉద్యోగులను మానసిక ఒత్తిడులకు గురిచేయొద్దని కోరారు. అధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకోవడం ఆవేదన కలిగిస్తోందని తెలిపారు. మృతిచెందిన జూనియర్ అసిస్టెంట్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గద్దర్ జయంతి



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ములుకనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో శుక్రవారం దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు దివంగత ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల కలను తన ఆట–పాటలతో చైతన్యపరిచిన గాయకుడు గద్దర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో సైతం తన గళంతో ఉద్యమానికి ఊపిరూదిన గొప్ప వ్యక్తి గద్దర్ అన్నారు. నాయకులు వెంకటేష్, రాజు, శ్రీనివాస్, రాజయ్య, లక్ష్మారెడ్డి, సారయ్య రాజు, వెంకటస్వామి, తిరుపతి, భిక్షపతి, శ్రీనివాస్, అనిల్, సుధాకర్, అశోక్, వీరస్వామి, సదానందం పాల్గొన్నారు.

విహార యాత్రకు వెళ్లిన విద్యార్థులు



శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు శుక్రవారం రామప్ప, లక్నవరం పర్యాటక ప్రాంతాలకు విజ్ఞాన, విహార యాత్రకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రామప్ప శిల్పకళ ప్రాముఖ్యత, చారిత్రాత్మక కట్టడాల గురించి వివరించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రేవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌నకు గురుకుల విద్యార్థి ఎంపిక

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వరంగల్ వెస్ట్‌కు చెందిన బీకామ్ థర్డ్ ఇయర్ విద్యార్థిని మంగళపల్లి పద్మ.. నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌నకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. ఈమేరకు కళాశాల ఆవరణలో ఆమెను ప్రిన్సిపాల్‌తోపాటు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాధిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన కలిగిఉండాలి

కాజీపేట అర్బన్: ప్రతీ పౌరుడు పౌర హక్కులపై అవగాహన కలిగిఉండాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్ అన్నారు. కాజీపేట మండలంలోని తరాలపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమర మాట్లాడుతూ సమాజంలో పౌరులు స్వేచ్ఛగా జీవించేందుకు పౌర హక్కులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోజ్‌కుమార్, తరాలపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం అరుణ, ఆర్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు అభినందన

మడికొండ: మడికొండ శివారులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ నర్సింగ్ విద్యార్థులు 31మందికి అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు ప్రాంగణం మేనేజర్ జయశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వారిని మేనేజర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

అమ్మవారి సన్నిధిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హన్మకొండ కల్చరల్: నగరంలోని భద్రకాళి దేవాలయాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ముందుగా గోశాలలో గోవులకు గ్రాసం తినిపించారు. అమ్మవారికి పూజలు చేశారు. ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి మహాదాశీర్వచనం చేశారు.

'పది'కి పక్కా ప్రణాళిక

- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- పాఠ్యాంశాల వారీగా మోడల్ టెస్టులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



నడికూడ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నడికూడ : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ అధికారులు ముందడుగు వేస్తున్నారు. వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో విద్యార్థుల చదువుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే రోజువారి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో తరగతులు నిర్వహిస్తూ పాఠ్యాంశాల వారీగా ఉపాధ్యాయులు సందేహాలను నివృత్తి చేస్తున్నారు. జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు.

టార్గెట్ వందశాతం..

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే టార్గెట్ పెట్టుకున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. వరికోల్, నార్లాపూర్, రాయపర్తి, పులిగిల్ల, చర్లపల్లి, కంఠాత్మకూర్ తదితర పాఠశాలల్లో రోజువారీగా స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, ఆందోళన చెందకుండా ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లే విధంగా అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు



ఉపాధ్యాయులు ప్రతీ సబ్జెక్టును క్షుణ్ణంగా బోధిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. నేను 10/10 సాధించేందుకు తీవ్ర స్థాయిలో కష్టపడుతున్నాను.

– జవ్వాజీ లహరి, 10వ తరగతి

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మండలంలోని అన్ని పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. నేను కూడా రోజువారీగా ఒక్కో పాఠశాలను ఎంపిక చేసుకుని సందర్శిస్తున్నాను.

–కె.హనుమంతరావు, ఎంఈఓ

రైటింగ్‌పై దృష్టి



మంచి స్కోరింగ్ సాధించేందుకు రైటింగ్ ముఖ్యం. విద్యార్థుల చేతి రాత పరీక్షల్లో స్కోరింగ్‌కు ప్రాధన పాత్ర పోశిస్తుంది. విద్యార్థులకు ప్రతీరోజు రైటింగ్‌పై అవగాహన కల్పిస్తూ టెస్టులు నిర్వహిస్తున్నాం.

– మహ్మద్ సుభాని, హిందీ పండిట్

పోచమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించాలి



దామెర : పోచమ్మతల్లి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి



ఎల్కతుర్తి : రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రామానుజ జీయర్ స్వామి

దామెర : మండలంలోని ల్యాదెళ్లలో గల పోచమ్మతల్లి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు సహకరించాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి కోరారు. గ్రామంలోని పోచమ్మ ఆలయం పునర్నిమించేందుకు శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి తనవంతు సాయం అందిస్తానని అన్నారు. గ్రామంలో ఇప్పటికే ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. స్వగ్రామంలో ఆలయాలు పునర్నించుకోవడం ఆనందంగా ఉందన్నారు. గ్రామంలోని ప్రతిఒక్కరూ భక్తిభావంతో ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, పోచమ్మతల్లి ఆశీస్సులు గ్రామంపై ఉంటుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాగితాల శంకర్, మహిపాల్‌రెడ్డి, పిట్టల రమేశ్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండలంలోని సూరారం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీకోదండ రామాలయ నిర్మాణానికి శ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి శుక్రవారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు. తంగెడ ఫౌండేషన్, గ్రామస్తుల సహాయంతో నిర్మించనున్న ఈ ఆలయాన్ని త్రిదండి చిన్న శ్రీమన్‌నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనంలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాగా ఆలయ భూమి పూజ సందర్భంగా గ్రామంలోని ప్రజలందరు భక్తి శ్రద్ధలతో ఆలయ నిర్మాణ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవనాథ రామానుజ జీయర్ స్వామి రామాయణం, ఆలయాల ప్రతిష్ఠత గురించి చెప్పిన ప్రవచనాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రజలందరికీ తీర్థప్రసాదాలు అందించడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి డాక్టర్ ప్రేమానందరావు కృషితో తంగెడ నారాయణరావు, పీతాంబరరావు, సుదర్శన్‌రావు, రాంరావు, మోహన్‌రావు, దయానందరావు, వేణుగోపాల్‌రావు భూమిని విరాళంగా ఇచ్చారు.

విధుల్లో చేరిన ఎంపీడీఓ



దామెర : ఎంపీడీఓగా గుమ్మడి కల్పన శుక్రవారం విధుల్లో చేరారు. కొంతకాలంగా ఆమె సెలవుల్లో ఉన్నారు. ఆ సమయంలో ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. కాగా శుక్రవారం ఆమె విధుల్లో చేరారు. సిబ్బంది పుష్పగుచ్ఛం అందించారు.

ఈజీఎస్ సిబ్బంది పెన్‌డౌన్

దామెర : పెడింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈజీఎస్ సిబ్బంది శుక్రవారం పెన్‌డౌన్ పాటించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వర్తించకుండా నిరసన తెలిపారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. వేతనాలు చెల్లించే వరకు విధులు నిర్వహించేదిలేదని తేల్చిచెప్పారు. ఏపీఓ శారద, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత



శాయంపేట : మండలంలోని కొప్పులలో గుడుంబా తరలిస్తున్న ఇద్దరు మహిళలను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. జోగంపల్లి గ్రామం నుంచి పెట్రోలింగ్ నిర్వహిస్తూ కొప్పుల గ్రామంలో గల ఇందిరా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్న పోలీస్‌లకు ఇద్దరు మహిళలు అనుమానస్పందంగా కనిపించారు. దీంతో వారిని తనిఖీ చేయగా 50లీటర్ల గుడుంబా లభించినట్లు తెలిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే మళ్లీ చేపట్టాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

శాయంపేట : మండల కేంద్రంలో ఇటీవల చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అవకతవకలు జరిగాయని, మళ్లీ సర్వే చేసి అర్హులను గుర్తించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ ఫణిచంద్రకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్వేత, రాజేశ్వరి, శకుంతల మాట్లాడుతూ.. శాయంపేట గ్రామంలో ఇటీవల చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అవకతవకలు జరిగాయని, ఈనెల 24న జరిగిన గ్రామసభలో ప్రభుత్వ ఉద్యోగుల, ఆర్థికంగా ఎదిగిన, విదేశాల్లోఉన్న, ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారి పేర్లు అర్హులుగా గుర్తించారని తెలిపారు. నిజమైన అర్హుల పేర్లు జాబితాలో లేవన్నారు. మళ్లీ సర్వే చేపట్టి న్యాయం చేయాలని కోరారు. గ్రామస్తులు శ్రావణి, పద్మ, ఉమాదేవి, రజిత, భిక్షపతి, సంతోశ్‌కుమార్ వినతిపత్రం అందించినవారిలో ఉన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సుదర్శన్

నడికూడ : మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలోని నాలుగు కూడల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి, రోడ్డు భద్రత నియమ, నిబంధనలపై విద్యార్థులకు, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వొదని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది మైనర్లు మృతిచెందుతున్నారని, తల్లిదండ్రులు గమనించాలని అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, వాహనాలు నడిపే వయస్సు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లకవత్ దేవ, బత్తుల రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



శాయంపేట : మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రథమస్థానంలో రంగు సంజయ్, ద్వితీయస్థానంలో సాదు వంశీ, తృతీయస్థానంలో సాయిచరణ్ నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగే టెస్ట్‌లో పాల్గొననున్నట్లు భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు సత్యప్రసాద్ తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

దామెర : క్రీడలు శారీరక దృఢత్వానికి దోహద పడుతాయని డిస్నీల్యాండ్ పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి అన్నారు. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలో గల డిస్నీల్యాండ్ పాఠశాలలో ఇంట్రాముురల్ క్రీడలు శుక్రవారం నిర్వహించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



కప్ అందజేస్తున్న కమిషనర్

వరంగల్ అర్బన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల నిర్వహించిన వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బల్దియా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన ప్రజారోగ్యం, రన్నర్‌గా నిలిచిన టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సీఎంహెచ్ఓ రాజారెడ్డి, అడిషనల్ కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రవీందర్, సిటీ ప్లానర్ రవీందర్ వాడేకర్, ఎంహెచ్ఓ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు వద్దు

హన్మకొండ చౌరస్తా: ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరపాలని ఇంటర్ బోర్డు పెట్టిన కొత్త నిబంధనతో విద్యార్థులు మానసిక ఆందోళన గురవుతారని, దీన్ని వెంటనే రద్దు చేయాలని వరంగల్ ప్రైవేట్ జూనియర్ కాలేజీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్, మెడికల్, డిగ్రీ, పీజీ ప్రాక్టికల్లో సీసీ కెమెరాల నిబంధన లేదని, కేవలం ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించాలని కొత్తగా నిబంధన పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం ఈ విషయమై పునరాలోచించాలని కోరారు.

వంతెన నిర్మాణ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



నడికూడ : వర్షాకాలం నడికూడ-గొల్లపల్లి మధ్య గల రోడ్యాం ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో గత నెల 18వ తేదీన సాక్షిలో 'వంతెన నిర్మాణం ఎప్పుడో' శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. దీంతో స్పందించిన సదరు కాంట్రాక్టర్ రోడ్డు డైవర్షన్ పనులు ప్రారంభించి, వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

క్షయవ్యాధి నివారణకు కృషిచేయాలి

- డాక్టర్ మంజుల



నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

దామెర : క్షయవ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి మంజుల సూచించారు. మండల వ్యాప్తంగా క్షయవ్యాధి అనుమానితులు 247 మంది ఉండగా.. వారి నుంచి తెమడ పరీక్ష కోసం నమూనాలు సేకరించినట్లు తెలిపారు. క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు పాటించి పరీక్షలు చేసుకోవాలని అన్నారు. వ్యాధిని మొదటి దశలోనే గ్రహించి జాగ్రత్తలు పాటించాలని, వైద్యుల సూచనలు పాటించి వైద్యం పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేంద్ర, ఎంపీహెచ్ఓ అశోక్‌బాబు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ల్యాబ్ సూపర్‌వైజర్ జనార్ధన్, సిబ్బంది సౌందర్య, పద్మ, వనిత, భారతి, శోభారాణితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పరకాల : పోరాటాల గడ్డ ఓరుగల్లు ఉద్యమ బిడ్డ మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం యావత్ మాదిగ జాతికే గొప్ప గర్వకారణమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ కొనియాడారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు పాలభిషేకం చేశారు. జాతి ఔన్నత్యానికి చిహ్నం పద్మశ్రీకి మంద కృష్ణ మాదిగ ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోకిల రవి, డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామంచ రాజేందర్ మాదిగ, కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇనుముల కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

- బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ విమర్శించారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాయలంలో శుక్రవారం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని తెలిపారు. గత నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని గ్రామసభలు నిర్వహించి అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. రానున్న రోజుల్లో రేవంత్ సర్కార్‌కు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, మహేష్, తిరుపతి, ప్రవీణ్, రాజ్‌కుమార్, రమేశ్, చిరంజీవి, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువుల సంరక్షణపై దృష్టి సారించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

ఆత్మకూరు : పెంపుడు జంతువుల సంరక్షణపై దృష్టి సారించాలని పశుసంవర్ధకశాఖ జిల్లా సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహై స్కూల్‌లో శుక్రవారం పెంపుడు జంతువుల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెంపుడు జంతువుల ద్వారా ప్రజలకు సంక్రమించే వ్యాధుల గురించి వివరించారు. అలాగే పెంపకందారులు విధిగా వాటి సంరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పెంపుడు జంతువులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెటర్నరీ ఆస్పత్రికి తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా జంతు సంరక్షణ చట్టాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పశు రోగ నిర్ధారణ విభాగం సహాయ సంచాలకుడు డాక్టర్ నాగమణి, మండల పశు వైద్యాధికారి ధర్మానాయక్, డాక్టర్ వినయ్, జెడ్పీహై స్కూల్ హెచ్ఎం నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ గర్జన సభకు తరలిరావాలి



ఆత్మకూరు : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు : రేపు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరగనున్న బీసీ గర్జన సభకు తరలిరావాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర వ్యవస్థాపక నాయకుడు తెలంగాణ కొమురన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో బీసీ నాయకులతో కలిసి బీసీ గర్జన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలంతా అధిక సంఖ్యలో సభకు హాజరై సత్తా చాటాలని అన్నారు. ఆ సంఘం నాయకులు రాకేష్, సిరిపురం తిరుపతి, బయ్య తిరుపతి, కుమార్, రమేశ్, సాగర్, కుమార్ పాల్గొన్నారు.

శాయంపేట : ఫిబ్రవరి 2న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించతలపెట్టిన బీసీ రాజకీయ గర్జన బహిరంగ సభకు బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక రాష్ట్ర నాయకుడు దామెరకొండ కొమురయ్య ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

దామెర : రేపు హనుమకొండలో నిర్వహించనున్న బీసీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని ఊరుగొండ పద్మశాలి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్సై జానిపాషా



మాట్లాడుతున్న ఎస్సై జానిపాషా

ధర్మసాగర్ : యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై జానిపాషా సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో గల వీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం పోలీస్ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత గంజాయి, గుట్కా, పాన్‌మసాలా వంటి మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, సేవించినా సెల్ నంబర్ 8712584473 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. అలాగే చదువు ప్రాముఖ్యత, రోడ్డు ప్రమాదాల నివారణ, డయల్ 100, షీ టీమ్స్ సేవల గురించి వివరించారు. సైబర్ క్రైమ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుపుతూ సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 గురించి అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్లయ్య, హెడ్ కానిస్టేబుల్ మోహన్, కళా బృందం నాగమణి, విలియమ్ తదితరులు పాల్గొన్నారు.